
# సుకన్యానిర్ణయం

చివుకుల రామేశ్వర్



రాత్రి పన్నెండు గంటలయింది. ఆ వీధిలో అంతా నిర్మానుష్యంగా వుంది. వీధి సింహాల అరుపులు వినిపిస్తున్నాయ్. అక్కడ వున్న ఇళ్ళన్నీ మధ్య తరగతివారి ఇళ్ళే. జనంలో మొగవారికి ఆఫీసులే "ఆవొకేషన్" అయితే ఆడవారికి మాత్రం ప్రక్కింటి వారితో పొరుగుంటి ముచ్చట్లే కాలక్షేపం.

ఆ మధ్యలో వుంది ఓ చిన్న పెంకుటిల్లు. దాని చుట్టూ శిథిలమయిన ప్రహరీగోడ. ఆ ఇంటికి తగ్గట్టు వుంటాడు ఆ ఇంటి యజమాని. పేరు ప్రకాశరావు. ఆ ఇంటి చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కల్లా ఆయన మాసిన గడ్డంతో కనిపిస్తాడు. రైల్వేలో "నైట్ డ్యూటీ"లు చేస్తూ కాలం వెళ్ళబుచ్చి రిటైరయిన స్టేషన్ మాస్టరాయన.

ఆయన పుట్టిన రోజునే ఆ ఊరికి కరెంటొచ్చిన కారణంగా ఆయన పేరు 'ప్రకాశం' అని పెట్టుకున్నాడాయన తండ్రి! కాని, ఆయన జీవితంలో మాత్రం చీకటిని మిగిల్చాడు ప్రకాశం. అతను పుట్టిన మూడో నెలలకే తల్లి పోయింది. కారణం ఏదైనా అది మొదలు 'ప్రకాశం' ఊహ తెలిసే లోపలే తండ్రి కూడా భార్యను అనుసరించాడు.

మేనమామల ప్రాపకంలో వారి దయాదాక్షిణ్యాలతో పెరిగి 'మెట్రిక్' అనిపించుకుని పురుష లక్షణంగా రైల్వేలో 'స్టేషన్‌మాస్టర్' గిరి సంపాదించుకున్న ప్రకాశరావుకు సావిత్రి భార్యగా వచ్చింది. ప్రతి చిన్నస్టేషన్‌లో మూడేళ్ళ కంటే ఎక్కువగా వుంచని రైల్వేవారు అతని నలభయ్యేళ్ళ సర్వీసులో ఓ ఇరవై కరెంటు లేని స్టేషన్లకు తిప్పారు. ఈ తిప్పటలో నలుగురాడపిల్లల్తో భార్యని పోగొట్టుకుని చీకటిగలపాడులో రిటైరయ్యాడు ప్రకాశరావుము గ్గురాడ పిల్లలను అత్తారింటికి పంపిన ప్రకాశరావుకు చూపు మందగించింది. చేతిలో వున్న ప్రావిడెంట్ ఫండూ కరిగిపోయింది. అదుగో, ఆ పెంకుటిల్లు మాత్రం శిథిలశకలంలా మిగిలిపోయింది.

ఆయన ఆఖరి కోరిక మామూలు కోరికే. తన ఆఖరి కూతురు "సుకన్య" పెండ్లి చేయాలని. రిటైరయిన తర్వాత కూడా ఇచ్చే రైల్వే పాసుంది కాబట్టి ఎక్కడ ఏ సంబంధం వున్నదో కనుక్కొని అక్కడికి వెళ్ళొచ్చేవాడు.

అందం, చందం, చదువు, సంధ్యా వున్న సుకన్య అసలు హంగు కట్నం ఇచ్చుకోలేని ఆడపిల్ల కాబట్టి అలానే వుండిపోయింది. వయసు మాత్రం ముప్పయ్యేళ్ళు దాటింది. అందుకనే అప్పటిదాకా ముద్దుగా కన్యా అని పిలిచే ప్రకాశరావు సుకన్యని పేరు పెట్టి పిలవటం మానేశాడు. కన్యా అని పిలిస్తే పేరు సార్థకం అవుతుందని భయం ఆయనకు. చిన్నస్టేషన్లలో చదువు సదుపాయం లేక సుకన్యను చదివించలేకపోయాడు.

సుకన్య మాత్రం ప్రైవేటుగా ఎం.ఎ. పాసయి ఆ ఊరి మునిసిపల్ స్కూల్లో టీచర్‌గిరి సంపాదించుకుంది.

ఆ రోజు మామూలుగానే ఊరిలో తెల్లారింది.

తెల్లారాక ముసుపే నిద్ర లేవటం ప్రకాశరావుకు అలవాటు. నిద్రలేచి పాలపేకెట్టు తెచ్చి "అమ్మాయ్ లేమ్మా" అని సుకన్యని నిద్రలేపటం ఆయన దినచర్యలో భాగం.

ఆయన పిలుపు ప్రక్కింటి రామారావుకూ పిలుపే! అందుకు కారణమూ వుంది.

రామారావుకు సుకన్య లేచి ముగ్గెయ్యటానికి బయట కొస్తుందని తెలుసు.

ఈ మధ్య రామారావుకు సుకన్య కల్లోకి వస్తోంది/ పీతకష్టాలు పీతవన్నట్లు రామారావుకష్టాల్లో వున్నాడు. కష్టాలకు ఉపశమనం సుకన్య ఉదయదర్శనం. సుకన్య చీర మోకాళ్ళపైకి దోపి ఊడుస్తుంటే ఆశగా, ఆబగా చూస్తుంటాడు. మొదట్లో రామారావుని గమనించని సుకన్య తరువాత అతని చూపుల్లో అంతర్యం గ్రహించి హడావుడిగా పని పూర్తిచేసుకుని వెళుతున్నది.

అలాగని రామారావు మరీ కుర్రవాడేం కాదు. మనిషి స్ఫుటంగా, బలంగా వుంటాడు. రామారావుకు పెళ్ళయి భార్య ఇద్దరు పిల్లల్ని కని, పెంచి, పెద్దచేసి, పెళ్ళిళ్ళుకూడా చేసి హఠాత్తుగా "వైరల్ ఫీవర్"తో పోయింది. అప్పటికి రామారావుకింకా నలభై అయిదేళ్ళే. చిన్నతనంలో పెండ్లి కాబట్టి ఎదిగిన పిల్లలున్నారు.

భార్య పోయిన తర్వాత ఆ యింట్లో రామారావు ఒక్కడయి పోయాడు. రెండో పెళ్ళి చేసుకోమని బంధువర్గం ఎంత పోరాడుతున్నా అతను చేసుకోలేదు. అతని ఉద్దేశ్యంలో "బయట పాలు దొరుకుతుంటే ఆవునెందుకుకొనాలి" ఇంకో ఆడదాన్ని కొంపకు తెచ్చుకుంటే మరలా దానికి పిల్లలు పుడతారు. వాళ్ళ చదువులూ పెళ్ళిళ్ళూ! అబ్బ! తలుచుకుంటే భయం వేస్తుంది రామారావుకు!

సుకన్యను చూస్తే మాత్రం రామారావుకు అభిప్రాయం మారిపోయి కోరిక పెట్రేగి పోతున్నది. ఏదో రకంగా మాట కలిపి ఆవిడతో మాట్లాడదామని చూస్తున్నాడు.

"ఏం సుకన్యగారూ, మీ నాన్నవచ్చాడా? పాపం పెద్దాయన మీ కొరకు ఎంత బాధపడుతున్నాడు? ఆడపిల్ల పెళ్ళంటే మాటలా? మొన్న మా ఫ్రెండు తాలూకు ఒకమ్మాయి.. ఛ..ఛ.. లక్ష్మమేవిటీ, ఏ వయసే.. ఆవిడేం చేసిందో తెలుసా.. ఇల్లాగే పెండ్లి ఒక పట్టాన కాకపోతే పక్కింటి కుర్రాడితో లేచిపోయింది. ఎల్లాగయినా ఉప్పూ కారం తినే వయసుకదా" అంటూ ద్వంధార్థంతో మాట్లాడి సుకన్య మనసు పాడు చేసేవాడు.

సుకన్యకు మగజాతంటే రోజురోజుకు అసహ్యం పెరిగిపోతోంది!

ఈ సమాజంలో మగవాడికో నీతి ఆడదానికో నీతా?...

మగవాడు తాగొచ్చు!

పేకాటాడి డబ్బు తగలెయ్యొచ్చు!!

పెళ్ళాం చచ్చిన ఆర్నెల్లకే మరో ఆడదాని గొంతు కొయ్యొచ్చు!!


పెళ్ళి కాకుండానే విచ్చలవ డిగా తిరగచ్చు.

భగవంతుడా. ఎంత నిర్దయుడవయ్యా నీవు? ఆడది పెళ్ళి కాకుండా ఈ సమాజంలో బక లేదా? ఆడదాని శరీరం మగవాడి కామాగ్నికి సమిధిగా మారి యంత్రంలా పిల్లల్ని ఉత్పత్తి చేసి, వంశాన్ని నిలబెట్టేందుకేనా!"

అనుకుంటూ సుకన్య ఆలోచనల్లో మునిగిపోయింది.

"ఏంటమ్మా ఆలోచిస్తున్నావ్" అన్నాడు ప్రకాశరావు ఇంట్లోకి అడుగుపెడుతూ.

"అబ్బే ఏం లేదు నాన్నా" అంటూ తండ్రి వైపు




చూసింది సుకన్య. నలభయ్యేళ్ళు రైల్వేకి తన జీవితాన్ని ధారపోసిన తన తండ్రి రిటరై కూడా ఇంకా తన పెళ్ళి గూర్చి ఎంత బాధపడుతున్నాడు. తండ్రిని చూస్తే జాలేసింది సుకన్యకు.

ఏదో ఒక నిర్ణయానికి వచ్చిన దానిలా ఇంట్లోకి వెళ్ళి పనిలో మునిగిపోయింది.

** ** **

"ఏమండీ" అంటూ పిలుపు వినిపిస్తే ఎదురుగా కనిపించిన సుకన్యను చూచి ఆశ్చర్యపోయాడు రామారావు.

"ఎవరూ, సుకన్యా?" అంటూ కంగారుగా లేచి నిలబడ్డాడు.

"ఏమిటిలా వచ్చావ్?"

"మీతో మాట్లాడాలని" అన్నది సుకన్య నెమ్మదిగా.

"నాతోనా!" ఆశ్చర్యం మిళితమైన గొంతుతో.

"అవును. మీరు నన్ను పెళ్ళి చేసుకుంటారా?" అన్నది అతని కళ్ళలోకిచూస్తూ.

"నేనా!" మాటలు తడబడ్డాయి రామారావుకు. ఊహించని ప్రశ్న అది.

"మరీ, మరీ" అంటూ నీళ్ళు నమిలాడు రామారావు.

"నేనొచ్చి మిమ్మల్నిలా అడుగుతున్నానని మీరెన్నడూ అనుకొని వుండరు! అవును ఈ దేశంలో ఆడపిల్ల అలా అడుగితే చాలా చులకనగా ఆలోచిస్తారు. మరి మీరు ఇన్నాళ్ళుగా నన్ను ఏ ఉద్దేశ్యంతో చూస్తున్నారో అర్థం చేసుకోలేననా"

"అది కాదు సుకన్యా" అంటూ ఏదో చెప్పబోయాడు.

"మీరు చెప్పబోయేది నాకు తెలుసండి. ఈ వయసులో నాకు పెళ్ళేమిటీ అని కదూ! చూడండీ, వయసు దాటిన నాకు పెండ్లి కావటం కష్టం. అందుకని ఎవరో ఒక మొగవాడిని తీసుకురావాలని మా నాన్న ప్రయత్నం. ఆ మొగవాడు మీరే ఎందుకు కాకూడదూ? ఈ ఆడదాన్ని మీ భార్యగా చేసుకుని సాయం చేయరూ?"

ఏదో ఆలోచనలో వున్న రామారావు అనూహ్యాంగా వచ్చిన అవకాశనాని వదులుకోదలుచుకోలేదు.

"సరే సుకన్యా" అన్నాడు.

"థాంక్స్" అని సుకన్య అక్కడ నుండి వెళ్ళిపోయింది.

సుకన్య నిర్ణయం విన్న ప్రకాశరావు ఆశ్చర్యపోయాడు.

"అవును నాన్నా. నా పెళ్ళి మీ వయసుకు మరీ భారం అయింది. ఈ వయసులో నాకు దొరికే వారంతా రామారావు వయసువారే! ఆయనకేం తక్కువ. బాదర బందీ లేని మనిషాయన. ఎటువంటి ఆర్భాటం లేకుండా ఈ పెండ్లి జరిపించండి" అని తండ్రికి చెప్పింది.

సుకన్య కోరిక ప్రకారం పెండ్లి జరిగింది.

రామారావుకూ సుకన్యతో ఆర్భాటం లేని పెళ్ళి జరగటం చాలా హాయిగా అనిపించింది.

ఎంత అదృష్టవంతుడు తను! అందమైన సుకన్య తనంతటతనే తన జీవితంలో ప్రవేశించి మరలా తనకు నూతన మధురానుభూతుల జీవితాన్ని ప్రసాదించబోతుంది. ఇలా ఊహలతో తన ఇంటికి ఆహ్వానించాడు.

సుకన్యతో మొదటి రాత్రిని తనింట్లోనే ఏర్పాటు చేసుకున్నాడు.

సుకన్య శోభనపు గదిలో ప్రవేశించగానే ఆత్రంగా దగ్గరకు తీసుకోబోయాడు.

"ఆగండి. నా మొదటి కోరిక అదే మీతో పెండ్లి అది తీర్చారు. ఈ రెండో కోరిక కూడా తీర్చండి" అంటూ కొన్ని కాగితాలు చూపించి "వాటిపై సంతకాలు పెట్టండి" అంది. రామారావు అదేమిటని అడిగే పరిస్థితిలో లేడు. అతని మనసంతా ఓ మత్తులా వుంది. ఆ తమకంలో సంతకాలు పెట్టేశాడు.

సుకన్య కాగితాలు తీసుకుని మరలా వస్తానని ప్రక్కన వున్న తన ఇంటికి వెళ్ళిపోయింది. సుకన్య కోసం చూచి చూచి రామారావు తాపంతో వేగి... వేగి... చివరకు నిద్రలోకి జోగిపడి పోయాడు.

## శిల్పి చాతుర్యం!

సతీషన్ ఓ మంచి శిల్పి ఎప్పుడూ అతనిలో కొత్త కొత్త భావాలు మొగ్గతొడుగుతూ వుంటాయి. ప్రతిభావంతుడైన సతీషన్ ఎటువంటి వస్తువుతో అయినా, చివరికి అది పనికిరానిది అయినా, దానితో ఓ చక్కటి ఆకృతిని కల్పించి, కనువిందుచేసే బొమ్మలను రూపొందిస్తాడు.



తిరువనంతపురంలో వుంటున్న ఈ యువకుడు – సైకిల్ ఫోర్క్‌లతో, ఫ్రిజ్‌లోని స్పేర్‌పార్ట్‌లతో, స్టవ్ బర్నర్‌లతో, పి.వి.సి. పైపులతో, రాళ్ళతో అందమైన బొమ్మలను, శిల్పాలను రమణీయంగా రూపకల్పన చేస్తాడు!




## కనువిందు చేసే స్టాంపులు!

ప్రపంచంలో సినిమాలు నిర్మించడం ప్రారంభించి వంద సంవత్సరాలు అయింది! ఆ సందర్భాన్ని పురస్కరించుకుని సినీ శతవార్షికోత్సవాలు ప్రపంచమంతటా ఘనంగా జరపబడ్డాయి. ఆ ఉత్సవాల తీపి గుర్తుగా అమెరికా, టాంజానియా మున్నగు దేశాలు ప్రముఖ సిని మాతారల చిత్రాలతో అద్భుతమైన స్టాంపులను ముద్రించి, విడుదల చేశాయి. మార్లిన్ మన్రో, సోఫియా లోరెన్, గ్రేస్ కెల్లీ, క్లింట్ ఈస్ట్‌ఉడ్, క్లార్క్ గేబుల్, మార్సెల్లో మాస్ట్రోయాన్నీ బొమ్మలతో ఈ స్టాంపులు వెలువడి, ప్రేక్షకులను విశేషంగా ఆకర్షించి, భారీ ఎత్తున అమ్ముడయ్యాయి!

మర్నాడు ప్రొద్దున ప్రకాశరావు వచ్చి సుకన్య వంట్లో బాగోలేక రాలేకపోయిందని క్షమాపణలు చెప్పకున్నాడు.

రామారావుకు తన కొత్త పెళ్ళాంపై కోపం వచ్చింది. వెంటనే వచ్చి విషయం ఏమిటని సుకన్యను అడిగాడు.

అప్పడుకూడా ఆమె సమాధానం అదే.

అలా రోజులు గడిచాయి. ఒకరోజు సుకన్య తన భర్త ఏమనుకుంటున్నదో అనుకుని ఆమె ఇంట్లో వున్న సమయంలో వచ్చి...

"ఏదో దాస్తున్నావ్... అనారోగ్యం కానే కాదు. నిజం చెప్పు" అంటూ నిలదీశాడు.

ఏ సమాధానం చెప్పని సుకన్య ఓ కవరు చేతికిచ్చింది. "ఇంటికి వెళ్ళి చూచుకోండి" అంది.

ఇంట్లో ప్రవేశించిన రామారావు కవరు తెరచి చూస్తే అందులో

రామారావుగార్కి,

క్షమించండి మిమ్మల్ని బాధపెట్టినందుకు. చూడండి రామారావ్ పరాయి ఆడది నిస్సహాయంగా కనిపిస్తే మీ మగజాతి ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటుందని మీరు నిరూపించారు. అన్ని అనుభవాలు, సుఖాలు పొందిన మీరు ఒంటరిగా ముసలి తండ్రితో వున్న నన్ను ఎప్పడు అనుభవిద్దామా అనే 'మృగతృష్ణ'తో చూశారు. మీ మగవారికి ఆడదాని శరీరం మీద అందంగా కనిపించే మాంసం తప్ప, అందులో యిమిడిన మనసు తెలీదు. ఎదపొంగులు తప్ప వాటి క్రింద ఆవేదన పడే హృదయం తెలీదు. కట్నాల కోరల్లో చిక్కుకుని పెళ్ళికాని ఆడవారు మీలాటి స్వార్థపరుల చేతుల్లో ఎంతమంది ఆహుతవుతున్నారో మీకు తెలీదు. నాకు మీ మగజాతంటే అసహ్యం. మీరు వివాహం చేసుకుంది నన్ను ఉద్ధరించడానికి కాదని నాకు తెలుసు. మీ శారీరిక వాంఛలు తీర్చుకోవడానికి నన్ను వెంటనే అంగీకరించారని, తరువాత నన్ను బానిసగా మార్చి మీ చివరి జీవితంలో చాకిరి చేసిపెట్టే యంత్రంలా మారుస్తారని తెలుసు! నేనొక నిర్ణయానికి వచ్చాను. ఆ నిర్ణయం ఫలించటానికి మిమ్మల్ని వాడుకున్నాను. సమాజం దృష్టిలో నేను మీ భార్యను. మీరు సంతకాలు పెట్టిన కాగితాలు మీరు విడాకులు కోరుతూ వ్రాసుకున్న పత్రాలు..ఇప్పడు మనం విడాకులు పొందాం. ఇలా నేను ఎందుకు చేశానని మీకు షాక్ తగలొచ్చు. స్త్రీ జీవితం ఈ సమాజంలో శాపంలా తయారయింది. పురుషుడి అహంకారం క్రింద అణగిపోయింది. ఆమె ఒంటరిగా వుంటే ప్రతి మగవాడికీ అలుసు. ఆమె పెళ్ళయి కాదు పెటాకులయి ఓ దరిసపడి వుంటే నిర్లజ్జగా పైకెగసిన ఈ పురుషుడి విషపూరిత పంజా ఛాయలు ఆమె మీద అంతగా ప్రసరించవు.

నాకు పెళ్ళయింది.

అంటే నేను గృహిణిని.

నాకు విడాకులు ఇచ్చారు.

అంటే నేను మొగుడు వదిలిన భార్యను!!

ఒక స్త్రీకి వయసులో ఏది జరుగలేదని ఈ సమాజం ఎగతాళి చేస్తుందో... ఆ పెళ్ళి అయింది.

ఇప్పడు నేను ముందుకు వెళ్ళాను.

భర్తతో విబేధించి విడాకులు తీసుకున్నాను. ఇప్పడు నా ముసలి తండ్రి ఆర్థిక అసహాయతను గానీ – ఏ పురుషుడి దరిచేరని నా కన్యాత్వం గురించి కానీ ఈ సమాజం చెవు కొరుక్కోదు.

'మనీ'తో మొగుడినికొని సంసారాలు సాగించే స్థాయి నాకెటూ లేదు కనుక ఆ ఆర్థిక సంబంధాల యాంత్రిక జీవితం బాధ నాకెటూ ఇష్టం లేదు. కనుక... నేను జీవితాంతం హాయిగా పిల్లలకు పాఠాలు చెప్పకుంటూ బ్రతుకుతాను.

ఈ నిర్ణయం మీకు వింతగా కనిపించవచ్చు.

ఈ నిర్ణయం తీసుకోవటానికి గల నేపథ్యంలో నా తెలివి తక్కువ తనం కంటే ఈ సమాజ నేరమే అధికమని ఆఖరిసారిగా చెబుతూ మీ నుండి సెలవు తీసుకుంటున్నాను!"

ఇట్లు
మీ మాజీ భార్య
సుకన్య ★